## క్లుప్తంగా

### సీఎం జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

పామూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక అనిల్‌గార్డెన్స్ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి కోరారు. కేక్ కటింగ్ అనంతరం గంటా రమణయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిదులు, నాయకులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

### అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

హనుమంతునిపాడు: మండలంలోని ముప్పాళ్లపాడు, దాసళ్లపల్లి, కూటాగుండ్ల, హాజీపురం, సీతారాంపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీఓ కె.లలిత బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలనోని పిల్లలకు బడి పిల్లలతో పాటు భోజనం అందించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

# ఏసుక్రీస్తు సూక్తులు అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్



పాల్గొన్న ప్రజలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

కనిగిరి రూరల్: అందరికీ మంచి చేయాలి, పొరుగువారిని ప్రేమించాలి, శాంతి సమాధానాన్ని అందరికీ పంచాలన్నదే క్రీస్తు సందేశమని, ఆయన సూక్తులు ఆచరణీయమని రాష్ట్ర మున్సిపల్ పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు, సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లకు, ముస్లిం మౌల్వీలు, మౌజన్‌లకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తాగ్యమూర్తులు జన్మించిన నెల డిసెంబర్ నెల అని కీర్తించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం కూడా ఇదే నెల అని కొనియాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే తప్ప పేద వర్గాలకు భవిష్యత్ లేదన్నారు. బుర్రా మధుసూదన్ యాదవ్‌ను తిరిగి ఆశీర్వదించి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీ రాజకీయాల కతీతంగా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. బడుగు వర్గాలకు ఎంతో ఉన్నత స్థానం కల్పిస్తూ వెన్నుండి నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలన్నీ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు వస్తుందన్నారు. అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే 1000 మందికి దుస్తులు పంపిణీ చేశారు.

# సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారునికి అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

వెలిగండ్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లెలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేసిన పథకాలను వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, విద్యాభ్యాసానికి పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో విద్యారంగానికి బడ్జెట్‌లో 10 శాతంకు పైగా నిధులు కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలు పేదల విద్యాకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు నివేశనాస్థలం మంజూరుచేయించాలని, పింఛన్ మంజూరు చేయించాలని కోరగా తక్షణం వారికి అర్హతఉంటే సంక్షేమ పథకాలు వచ్చేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే నవరత్నాల పథకాల పేరుతో వాటి లబ్ధిని మహిళల ఖాతాకే జమ చేస్తున్నారన్నారు. త్వరలో వైఎస్సార్ ఆసరా, వసతిదీవెన, విద్యా దీవెన నగదు ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి నాగిరెడ్డిపల్లె గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బుర్రాకు స్థానిక నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాతపూడి సుకుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు వై.నాగూర్‌యాదవ్, టి.నాని, గంజి రవీంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- డ్వామా పీడీ శీనారెడ్డి

వెలిగండ్ల: మండలంలో ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ కె.శీనారెడ్డి హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 15వ ప్రజావేదిక స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజావేదికలో మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన మొత్తం 791 పనులకు సంబంధించి ఖర్చుచేసిన రూ.9.53 కోట్ల వివరాలపై ప్రజావేదికలో డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీతో కలిసి వివరించారు. ఉపాధి పనుల్లో మొత్తం 757 పనులకు సంబంధించి కూలీలకు రూ.8.11 కోట్లు, మెటీరియల్ కింద రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పీఆర్‌కింద గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, పాలకేంద్రాలు, హెల్త్‌సెంటర్స్ మొత్తం 26 పనులకు సంబంధించి రూ.77.90 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ కింద 3 పనులకు రూ.3.40 లక్షలు, ఎస్‌ఎస్‌ఏ కింద 5 పనులకు రూ.10.74 లక్షలు ఖర్చు చేసినట్లు ప్రజావేదికలో డీఆర్‌పీలు వివరించారు. పలు పంచాయతీల్లో మస్టర్లు నిర్వహించడంలో లోపాలను గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన పనుల కొలతలకు, రికార్డుల్లో నమోదు చేసిన కొలతలకు వ్యత్యాసాన్ని గుర్తించారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. 21 గ్రామ పంచాయతీల్లో రూ.6.65 లక్షలు రికవరీగా గుర్తించామన్నారు. నిర్లక్ష్యం వహించిన వారికి పెనాల్టీతో పాటు మొత్తాన్ని రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ఎంపీడీఓ టి.సుకుమార్, డీవీఓ ఝాన్సీ, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఓ శ్రీనివాసనాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



వెలిగండ్లలో వివరాలు తెలుసుకుంటున్న డ్వామా పీడీ శీనారెడ్డి

హనుమంతునిపాడు: మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీలు నిర్వహించారు. హనుమంతునిపాడులో బుధవారం సామాజిక ప్రజావేదిక డ్వామా పీడీ కె.శీనారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో కూలీల పనులు రూ.7.67 కోట్లు, పంచాయతీరాజ్ శాఖలో రూ.84.22 లక్షలు, అటవీ శాఖ కింద రూ.12 లక్షలు, వీటితో పాటు మరికొన్ని మొత్తం రూ.9.26 కోట్లతో పనులు జరిగాయి. ఈ పనులకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ కె.లలిత, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, ఏపీడీ రాజారావు, జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి పాల్గొన్నారు.



హనుమంతునిపాడులో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ

## ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన



పరిశీలిస్తున్న ఫ్లోరోసిస్ అధికారులు

కనిగిరి రూరల్: జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ వేమా అనీల్ కుమార్ బుధవారం కనిగిరిలో పర్యటించారు. పలు పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. చాకిరాల ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడి వారికి ఉన్న దంత సమస్యలను పరిశీలించారు. తాగునీరు, వాడుకనీరు, భోజనంలో వాడే నీటిని గూర్చి తెలుసుకుని పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. వైద్యులు స్వప్న, దాదా షరీఫ్, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెచ్‌ఎం ముక్కు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఎంట్రీ ఓట్లపై విచారించాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పీసీపల్లి: మండలంలో ఉన్న డబుల్ ఎంట్రీ ఓట్లపై విచారించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు రేగల బాలయ్య కోరారు. స్థానిక సచివాలయ ఆవరణలో బుధవారం విచారణకు వచ్చిన తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గుదేవారిపాలానికి చెందిన ఓటర్లు దాదాపు సుమారు 230 ఓట్లు గుంటూరులో కూడా ఉన్నాయని, వారి డోర్ నెంబర్లు , ఓటర్ ఐడీ నంబర్లు, బూత్ నంబర్లతో సహా సమాచారం ఇచ్చినా కూడా బీఎల్‌ఓలు తొలగించడం లేదని ఆరోపించారు. వాటిని రాతపూర్వకంగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు.



# ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్‌కు అభినందనలు



బత్తుల సుప్రజకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సింగరాయకొండ: ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన బత్తుల సుప్రజకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, సుప్రజ దంపతులను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బత్తుల సుప్రజ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ తనపై నమ్మకం ఉంచి పదవీ కాలాన్ని పొడిగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రాపూరి ప్రభావతి, జిల్లా మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నౌషాద్ బాషా, మాజీ సర్పంచ్ చుక్కా కిరణ్‌కుమార్, చొప్పర వెంకన్న, చొప్పర కిరణ్, కార్యకర్తలు, కనుమళ్లయువకులు పాల్గొన్నారు.

## 6వేల మందికి అన్నప్రసాదం

పామూరు: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద బుధవారం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ గుత్తి వెంకటరాజా, కావేటి సుబ్బయ్యలు ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు 6 వేల మందికి పైగా పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, బీజేపీ నాయకులు కే.వి.రమణయ్య, ఇర్రి కోటిరెడ్డి, మాలధారులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం, ప్రభుత్వాసుపత్రిలో సెమీ క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. అనంతరం దైవ సందేశం వినిపించారు. ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, వెలుగు ఏపీఎం నారాయణ, డాక్టర్ సందీప్, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సీసీలు, డ్వాక్రా సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఎంపీడీఓ జలజాక్షి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జలజాక్షి

జరుగుమల్లి: మండలంలో మెగా కంప్లీషన్ డ్రైవ్ కింద ఎంపిక చేసిన గృహాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కె.జలజాక్షి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాల పురోగతిపై బుధవారం సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 20 పంచాయతీల్లో మెగా కంప్లీషన్ డ్రైవ్ కింద 171 ఇళ్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిని జనవరి 31వ తేదీకల్లా పూర్తయ్యేలా చూడాలని సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలను ఆదేశించారు. లబ్ధిదారులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు.

ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని సచివాలయ సెక్రటరీలను ఎంపీడీఓ ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ ఎస్.రమాదేవి, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ సింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్ నాయక్

కనిగిరి రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు కేటాయించిన నిధులు, పథకాలు వారికే అందించాలన్నారు. బొగ్గలగొంది కాలనీ, కాశిరెడ్డి కాలనీల్లోని గిరిజనులకు తాగునీటి వసతికి తక్షణం ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని, బొగ్గుల గొంది కాలనీలోని బడిమానేసిన పిల్లలను తక్షణం హాస్టల్‌కు పంపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులు చేపల అమ్మకాలకు పట్టణంలో సూచించిన ప్రదేశాన్ని త్వరగా కేటాయించాలని, చేపలు పట్టేందుకు వారికే కేటాయించాలని చెప్పారు. డీఏఓ జయవర్ధన్‌రెడ్డి, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎంఈఓ నారాయణరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఏఎన్‌ఎంలు పనితీరు మెరుగుపరుచుకోవాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పద్మజ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ పద్మజ

సింగరాయకొండ: ఏఎన్‌ఎంలు తమ పనితీరు మార్చుకుని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సకాలంలో సేవలందించాలని, టీకాలు వేయడంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి.పద్మజ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాయం-4, మూలగుంటపాడు పంచాయతీలో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో డాక్టర్ల కృషి కారణంగా ఇటీవల కాలంలో ప్రసవాలు, ఓపీల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. నియోజకవర్గ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ కె.ధీరేంధర్ కుమార్, డాక్టర్ చైతన్యకృష్ణ, డాక్టర్ ఉజ్వల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కొండపిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

- హాజరుకానున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ తొలిసారిగా గురువారం కొండపిలో పర్యటిస్తున్నారు. కొండపిలోని సీతారామ కళ్యాణ మండపంలో నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొంటారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం 3.40 గంటలకు వల్లూరమ్మ ఆలయంలో పూజల అనంతరం మంత్రి రోడ్డు మార్గాన టంగుటూరు మీదుగా కొండపి చేరుకుంటారని వివరించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆటో తిరగబడి గాయాలు

వెలిగండ్ల: ఆటో తిరగబడి అంగన్‌వాడీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే హెచ్‌ఎంపాడు మండలం నుంచి వెలిగండ్ల కు ఆటోలో అంగన్‌వాడీ టీచర్లు బయలుదేరి వస్తున్నారు. వెలిగండ్ల మండలం కంకణంపాడు వాగు వద్ద మలుపు తిరగబోయే క్రమంలో ఆటో బోల్తా పడటంతో దాసళ్లపల్లి అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో వరలక్ష్మి కాలు, చేయి విరిగాయి. చికిత్స నిమిత్తం 108లో కనిగిరి ఆసుపత్రిలో చేర్పించారు.

## సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల్లో సత్తా చాటాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మండలస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో చెన్నపునాయునిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం చాంద్‌బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు సైన్స్‌ఫేర్‌లో చంద్రయాన్-3 ని ప్రదర్శించి సత్తాచాటిన 8వ తరగతి విద్యార్థులు షేక్.ఖాదర్ ఇర్ఫాన్, సీహెచ్.చరణ్‌తేజలను అభినందించి ప్రోత్సాహమందించారు. రాష్ట్ర మానవహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే.గౌస్, సీహెచ్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ జానకి, పోలయ్య, ఉపాధ్యాయులు షరీఫ్, దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## 71 మందికి వైద్య పరీక్షలు

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలం అనకర్లపూడి గ్రామ సచివాలయంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 71 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష తెలిపారు. వీరిలో 35 మంది దీర్ఘకాలిక రోగులు ఉన్నారు. అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

కనిగిరి రూరల్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు దాత, పీసీపల్లి ఎంఈఓ ఆర్ శ్రీనివాసరావు ఎస్‌ఎస్‌సీ స్టడీమెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం బాపిరెడ్డి ఇందిరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ సంజీవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## లారీని ఢీకొన్న కారు

టంగుటూరు(సింగరాయకొండ): ఐరన్ లోడ్‌తో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి అతివేగంగా కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం ఉదయం టంగుటూరు మండల పరిధిలో జాతీయ రహదారిపై వావిలేటిపాడు జంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌పై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నై నుంచి హైదరాబాద్‌కు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని తిరుపతి నుంచి కాకినాడకు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో ఢీకొట్టాడు. కారులో ఉన్న కాకినాడ టౌన్ తిమ్మాపురం ప్రాంతానికి చెందిన జాలా కిరణ్, తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన పచ్చిమల వెంకటరమణకు తీవ్రంగా, తిమ్మాపురానికి చెందిన గుండాపల్లి శ్రీనుకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ ఖాదర్‌బాషా తెలిపారు.